ఆలోచింపజేసిన వైజ్ఞానిక ప్రదర్శన



వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఎంజీరోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆలోచింపజేసింది. విద్యార్థులు వివిధ అంశాలతో కూడిన వైజ్ఞానిక నమూనాలను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా కేర్ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ అర్చన హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

అమరులకు నివాళి



పద్మారావునగర్: ఎమ్మార్పీఎస్ సుదీర్ఘ ఉద్యమంలో అసువులు బాసిన వారికి నాయకులు శనివారం నివాళులర్పించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రునగర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులకు మాచర్ల ప్రభాకర్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్సీఆర్పీ రాష్ట్ర అధ్యక్షులు డి. సుదర్శన్‌బాబు, నాయకులు కుర్మ మహేందర్, శ్రీకాంత్, టీవీ వాసు పాల్గొన్నారు.

గంగుబాయి బస్తీలో...



అమరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అమీర్‌పేట: ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడి అమరులైన వారికి దళిత సంఘం నాయకులు నివాళులర్పించారు. అమీర్‌పేట గంగుబాయి బస్తీలో శనివారం అమరుల చిత్ర పటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘం నేతలు గొలుసుల సత్యనారాయణ మాదిగ, శ్రీనివాస్, రాజు, యాదగిరి, బాబు, చిన్న, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హిందీ భాషను బలవంతంగా రుద్దొద్దు

లాలాపేట: నూతన జాతీయ విద్యావిధానం పేరుతో హిందీ భాషను బలవంతంగా దక్షిణాది రాష్ట్రాలపై రుద్దిదే తిరుగుబాటు తప్పదని దక్షిణాది జాక్ చైర్మెన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ హెచ్చరించారు. శనివారం తార్నాకలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో దక్షిణాదికి తీవ్ర ద్రోహం చేస్తుందనీ విమర్శించారు. 2026లో జరిగే డీలిమిటేషన్ ద్వారా 130 ఎంపీ స్థానాల్లో 30 స్థానాలు కోల్పేయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. నాయకులు సంజీవరావు, అనంద్‌కుమార్ తదితరులున్నారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జీఆర్పీ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. శనివారం ఉదయం 7 గంటల సమయంలో బీబీనగర్-ఘట్కేసర్ రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలోని పట్టాలపై 30-35 సంవత్సరాల మధ్య వయస్సు గల వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

అనారోగ్యంతో..



సికింద్రాబాద్: అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సికింద్రాబాద్‌రైల్వే స్టేషన్లోని ప్లాట్ ఫామ్ నెంబర్ 1లో శనివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సదరు వ్యక్తి వద్దకు వెళ్లి చూడగా అప్పటికే అతడు మృతి చెందాడని తెలిపారు.

సచివాలయాన్ని ముట్టడిస్తాం

ఉస్మానియా యూనివర్సిటీ: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వారం రోజుల్లో విడుదల చేయకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తాని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ హెచ్చరించారు. శనివారం ఆయన ఓయూలో మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయనందున 12 లక్షల మంది విద్యార్థులకు కాలేజీల యాజమాన్యం వివిధ కోర్సులు పూర్తి చేసినా డిగ్రీ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. దీంతో ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బూర శ్రీనివాస్‌గౌడ్, బండి నరేష్ పాల్గొన్నారు.

ప్రతి కాలనీకి వస్తా .. సమస్యలు పరిష్కరిస్తా

- కంటోన్మెంట్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా
- ఎమ్మెల్యే శ్రీగణేశ్



భావనా కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. శనివారం ఆరోవార్డు భావనా కాలనీలో పర్యటించిన ఆయన స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు ప్రతి కాలనీ, బస్తీలో పర్యటిస్తున్నానని అన్నారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా అన్ని ప్రాంతాల్లో సమస్యలను పూర్తిగా తెలుసుకునే అవకాశం కలుగలేదన్నారు. అందుకే ప్రతీవారం కొన్ని ప్రాంతాల్లో పర్యటిస్తానన్నారు. భావనా కాలనీలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ సమస్యలు ఉన్నట్లు స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో నేరుగా అక్కడి నుంచే అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఆయన త్వరలోనే ఆయా సమస్యలు తీర్చాలని సూచించారు. వీలైంత త్వరగా అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. ఎలాంటి సమస్య ఉన్నా కాలనీవాసులు తన దృష్టికి తీసుకురావాలని.. వాటికి పరిష్కారం చూపే బాధ్యత తనదని ఎమ్మెల్యే అన్నారు.

మల్టీ పర్పస్ హాలుకు స్థలమివ్వండి

కంటోన్మెంట్ బోర్డు పరిధిలో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాలు నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయిస్తే, రాష్ట్ర ప్రభుత్వం తరపున నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. శనివారం కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్‌ను కలిసి బోర్డు పరిధిలోని పలు సమస్యలపై చర్చించారు. పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో నివసించే కంటోన్మెంట్ ప్రాంతంలో పేదలకు అందుబాటులో ఉండేలా మల్టీపర్పస్ ఫంక్షన్ హాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో లాల్‌బజార్‌లోని గాంధీ కమ్యూనిటీ హాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదన్నారు. గత బోర్డు సభ్యులు, అధికారుల అనాలోచిత నిర్ణయాల కారణంగా గాంధీ కమ్యూనిటీ హాలు కాస్త చెత్త డంపింగ్ కేంద్రంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో పేదలకు ఉపయోగపడేలా మల్టీపర్పస్ ఫంక్షన్ హాలు నిర్మించాలన్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కరించండి



వాటర్‌వర్క్స్ జీఎం వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశాల్‌సూదం తదితరులు

సనత్‌నగర్: బేగంపేట డివిజన్ పరిధిలో నెలకొన్న మంచినీటి, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలంటూ స్థానిక కాంగ్రెస్ నేతలు శనివారం వాటర్‌వర్క్స్ జీఎం వినోద్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. వాటర్ వర్క్స్ జీఎం కార్యాలయంలో ఆయనతో పాటు డీజీఎం ఆశిష్, మేనేజర్ రామేశ్వర్‌తో కలిసి పలు సమస్యలపై చర్చించారు. పలుచోట్ల నీటి సరఫరాలో లో ప్రెషర్ కారణంగా సరిపడా నీరు అందక జనం ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే స్థానిక జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైప్‌లైన్లు లేకపోవడంతో తరచూ మ్యాన్‌హోళ్లు పొంగుపొర్లుతూ ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయని జీఎం దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే అంచనాలు రూపొందించి కొత్త పైప్‌లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. సీనియర్ కాంగ్రెస్ నేతలు విశాల్ సూదం, సలీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి చర్యలు



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి..

అమీర్‌పేట: డివిజన్ పరిధిలోని అన్ని బస్తీలు, కాలనీల్లో రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. సనత్ నగర్ డివిజన్ రవీందర్‌నగర్‌కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనతో పాటు మంచినీటి రిజర్వాయర్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు విజయ్ సింగ్, ప్రతినిధులు సుదర్శన్, రమణారెడ్డి, పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న ఎస్సార్‌నగర్ ఏసీపీ వెంకటరమణ

సనత్‌నగర్: నిరుపేదల ఆరోగ్యానికి ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో దోహదం చేస్తాయని ఎస్సార్ నగర్ ఏసీపీ వెంకటరమణ అన్నారు. శంకర్ నేత్రాలయ, సంకేత్ ఆర్గనైజేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ సనత్ నగర్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సనత్‌నగర్ వెజిటెబుల్ మార్కెట్ పార్కులో నిర్వహించిన ఈ శిబిరంలో దాదాపు 700 మంది వరకు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. సరోజినీదేవి కంటి ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్, శంకర్ నేత్రాలయం అధినేత డాక్టర్ రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా 550 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. అవసరమైన 20 మందికి శంకర్ నేత్రాలయంలో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. ఎస్సార్‌నగర్ ఏసీపీ వెంకటరమణ, సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డిస్ట్రిక్ మాజీ గవర్నర్ ఓబుల్‌రెడ్డి, సనత్‌నగర్ అధ్యక్షుడు రమేష్ శాస్త్రి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ముస్లీం బస్తీలో పర్యటిస్తున్న మాజీ కార్పొరేటర్

అమీర్‌పేట: రంజాన్ మాసం నేపథ్యంలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ బీకేగూడ ముస్లిం బస్తీలో శనివారం పర్యటించారు. స్థానికంగా వీధిలైట్లు, శానిటేషన్ సమస్య నెలకొందని పలువురు పేర్కొన్నారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సహకారంతో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బస్తీ అధ్యక్షులు ఖాద్రీ, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన ట్రాఫిక్ పోలీసులకు సన్మానం



పదవీ విరమణ పొందిన వారిని సత్కరిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

సనత్‌నగర్: నార్త్‌జోన్ ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వర్తించిన పలువురు ట్రాఫిక్ పోలీసులు పదవీ విరమణ చెందిన సందర్భంగా ఏసీపీ శంకర్‌రాజు వారిని సత్కరించారు. నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో పదవీ విరమణ చేసిన ఎస్ఐ సర్దార్ (గోపాలపురం ట్రాఫిక్), ఏఎస్ఐలు రమణ (బోయిన్‌పల్లి), సత్యనారాయణ (బేగంపేట)లను సన్మానించి వారి సేవలను కొనియాడారు.

రేపు జెక్‌కాలనీలో 'మహిళలు మహారాణులు' కార్యక్రమం

సనత్‌నగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 3వ తేదీన 'జెక్‌కాలనీ మహిళలు మహారాణులు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు ప్రభా అనంతరెడ్డి, ఎస్.అన్నపూర్ణ తెలిపారు. ఈ మేరకు శనివారం ఏర్పాటుచేసిన సన్నాహక కార్యక్రమంలో వారు వివరాలను వెల్లడించారు. జెక్‌కాలనీ స్ట్రీట్‌నెంబర్-1లోని విజయ గ్రాండియర్ అపార్ట్‌మెంట్‌లో సోమవారం ఉదయం 11 గంటల నుంచి ఉల్లాసభరితమైన వాతావరణంలో జరిగే 'మహిళలు మహారాణులు' కార్యక్రమంలో భాగంగా పలు వినోద కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో భాగ్యలత, కృష్ణకుమారి, శారద, అమరావతి, హైమావతి, వల్లభనేని బేబి, శ్రీదేవి పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌కు సీఎం శుభాకాంక్షలు



లాలాపేట: జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి శనివారం సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.డిప్యూటీ మేయర్ పుట్టిన రోజు సందర్భంగా సీఎం నుంచి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్‌రెడ్డి ఉన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: కస్తూర్బా హైస్కూల్ యాజమాన్యం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేయడం అభినందనీయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. పాటిగడ్డ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో కస్తూర్బా హైస్కూల్ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భవిష్యత్తులో కస్తూర్బా పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు ప్రఖ్యాతులు తీసుకరావాలని కోరారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడం అభినందనీయం



పేదలకు భోజనం అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: పేదల ఆకలి తీర్చడం ఎంతో గొప్ప కార్యక్రమమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ మోడల్ కాలనీలోని మానవ సేవా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 90 రోజుల పాటు నిర్వహించే మిత ఆహార వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించి పేదలకు భోజనం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 10 సంవత్సరాల నుంచి దాతల సహకారంతో పేదలకు ఎంతో నాణ్యమైన భోజనం అందిస్తూ ఆకలిని తీరుస్తుండడం పట్ల వారిని అభినందించారు. వేసవి ముగిసే వరకు ప్రతిరోజూ సుమారు 300 మందికి భోజనం, 600 మంది వరకు మజ్జిగను అందించడం చాలా హర్షించదగ్గ విషయం అన్నారు. కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బాల్‌రెడ్డి, మేనేజింగ్ ట్రస్టీ బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి



పోస్టు కార్డుల ద్వారా ప్రదర్శన చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ప్రతినిధులు

బౌద్ధనగర్: ఉద్యమ కారులకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం ఫోరమ్ ఆధ్వర్యంలో సీతాఫల్ మండి పోస్ట్ ఆఫీస్ ఆవరణలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులను పంపించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ జీహెచ్ఎంసీ కన్వీనర్ గుండు దయానంద్, ప్రధానకార్యదర్శి జగన్ యాదవ్ పాల్గొన్నారు.

వర్గీకరణ శాస్త్రీయంగా అమలు చేయాలి

మందకృష్ణ మాదిగ



మాదిగ అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

బౌద్ధనగర్: మాదిగ అమరవీరుల త్యాగాలను ఎన్నటికీ మరువబోమని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కోరారు. శనివారం పార్శిగుట్టలోని పార్టీ కార్యాలయంలో మాదిగ అమరవీరుల సంస్మరణ కార్యక్రమం ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ సంపూర్ణంగా, శాస్త్రీయంగా ఎస్సీల్లో 59 కులాలకు సమాన న్యాయంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు అరుణ్, సాయికుమార్ పాల్గొన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ: ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఓయూలో శనివారం మాదిగ అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమానికి మందకృష్ణ మాదిగ హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగ అమరులకు ట్యాంక్‌బండ్ సమీపంలో ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించి స్థూపాన్ని నిర్మించాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో మాదిగ అమరుల కుటుంబాలకు రూ.25 లక్షలు, ఇంటి స్థలం, ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని సీఎంలను కోరారు. వర్గీకరణ పక్రియ సక్రమంగా చేయాలని ఈ నెల 4 నుంచి 10 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. మాజీ ఎంపీ వెంకటేష్ నేతకాని, పృథ్వీరాజ్‌యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా ఎంఐఎం ఆవిర్భావ దినోత్సవం

సనత్‌నగర్: ఎంఐఎం పార్టీ వ్యవస్థాపక దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. సనత్‌నగర్ ఏఐఎంఐఎం పార్టీ ఇన్‌ఛార్జి మహ్మద్ షౌకత్ ఆధ్వర్యంలో సనత్‌నగర్ బస్టాండ్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిచారు. కార్యక్రమంలో మహ్మద్ జావీద్, మహ్మద్ ఇమ్రాన్, యూసఫ్, జావిద్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎంఐఎం నాయకులు

సందడి చేసిన చిన్నారులు

అడ్డగుట్ట: నార్త్‌లాలాగూడ శాంతినగర్‌లోని పిపుల్స్ ఓన్ స్కూల్ 57వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఇమ్రాన్ మహమ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వేడుకల్లో భాగంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో చూపరులను ఆకట్టుకున్నారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జి. సుజాత, కరస్పాండెంట్ జీఎస్. వేణుగోపాల్‌లు బహుమతులను అందజేశారు. శంకర్ విద్యాలయ హైస్కూల్ కరస్పాండెంట్ చంద్రశేఖర్, శిల్ప గ్రామర్ హైస్కూల్ కరస్పాండెంట్ కే. లవ, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పాఠశాల వార్షికోత్సవంలో చిన్నారులు

చిరు వ్యాపారుల నిరసన

అడ్డగుట్ట: ఫుట్‌పాత్‌పై చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న తమ పొట్ట కొట్టొద్దని లాలాగూడ ఫ్రూట్స్ మార్కెట్ వెండర్లు వాపోయారు.శనివారం లాలాగూడలోని ఫ్రూట్స్ మార్కెట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా ట్రాఫిక్ పోలీసులు తమపై కన్నెర్ర చేస్తున్నారని, దీంతో వ్యాపారం పూర్తిగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 20 సంవత్సరాలుగా వ్యాపారాలు నిర్వహిస్తుంటే ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు తమ బండ్లను తొలగిస్తున్నారని చెబుతున్నారు. న్యూ బ్రిడ్జ్ నుంచి లాలాగూడ రైల్వే బాయ్స్ స్కూల్ వరకు దాదాపు 50 మంది చిరువ్యాపారాలు నిర్వహిస్తున్నారని వివరించారు. రంజాన్ మాసం నేపథ్యంలో పండ్ల విక్రయాలు అధికంగా జరుగుతాయని, ఇటువంటి సమయంలో తమను ఇబ్బంది పెట్టవద్దని కోరారు.



నిరసన తెలుపుతున్న చిరువ్యాపారులు

విద్యార్థులను ప్రోత్సహించాలి



సైన్స్ ఫెయిర్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: సైన్స్‌ఫెయిర్ లాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెరుగుతుందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. మారేడ్‌పల్లిలోని గౌతమ్ మోడల్ స్కూల్లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌కు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వివిధ నమూనాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులను చదువుతో పాటు ఆటపాటలు, ఆత్మ రక్షణ విద్యలు నేర్చుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు.